క్లుప్తంగా

ఆరోగ్య సంరక్షణ కార్డుల పంపిణీ



ఆరోగ్య సంరక్షణ కార్డులు పంపిణీ చేస్తున్న ఏడీ చిట్టినాయుడు

మాడుగుల రూరల్: జీవాల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా మాడుగులకు చెందిన గొర్రెలు, మేకల పెంపకందారులు గుంపాన అప్పారావు, బర్నికాన అప్పారావులకు సోమవారం ఆరోగ్య సంరక్షణ కార్డులను స్థానిక ఏరియా పశువైద్య సహాయ సంచాలకుడు వి. చిట్టినాయుడు అందజేశారు. మండలంలో ఇంతవరకు 2,260 గొర్రెలు, 113 మేకలు, 3,056 పశువులకు కార్డులు పంపిణీ చేశామన్నారు. వీటిపై క్యూ ఆర్ కోడ్ కలిగిన హాలోగ్రామ్ స్టిక్కర్లు అంటించి, 20 పేజీలు ఉంటాయన్నారు. ఇందులో గొర్రె, మేక ఆరోగ్య స్థితితోపాటు టీకాలు, బీమా వివరాలు నమోదు చేస్తామన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో పశువైద్య సహాయకుడి వద్ద కార్డులు తీసుకోవాలని సూచించారు.

తక్షణ సాయం అందజేత



నగదు అందజేస్తున్న దృశ్యం

చీడికాడ: మృతుని కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందించినట్లు అర్జునగిరి సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ గణేష్ సోమవారం తెలిపారు. చీడిపల్లి శివారు వెల్లంకి గ్రామానికి చెందిన పాత్రిని కుల్లినాయుడు(32) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడన్నారు. ఈ మేరకు వైఎస్సార్ బీమాలో భాగంగా తక్షణ సాయం కింద మృతుని కుటుంబానికి రూ.10 వేలు అందించామన్నారు. మిగిలిన రూ.90 వేలు నామినీ బ్యాంకు ఖాతాలో జమకానుందన్నారు. వార్డు మెంబర్ లక్ష్మి, పార్టీ నేత మతల పైడితల్లి పాల్గొన్నారు.

యువత శ్రమదానం

- నదీ స్నానానికి రహదారి ఏర్పాటు

రావికమతం: కొత్తకోట కాకులదిబ్బ ప్రాంతానికి చెందిన యువత సోమవారం శ్రమదానం చేసింది. నదీ స్నానానికి అనువుగా ఉండేలా రహదారి సౌకర్యం కల్పించుకుంది. కార్తీక మాసంలో కొత్తకోట సర్పానదిలో మహిళలు తెల్లవారుజామున స్నానమాచరిస్తుంటారు. అయితే బూరుగుమాను కట్ట వద్ద తుప్పలు పేరుకుపోయి ఇసుక మేట వేసి ఉండటంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. వారి ఇబ్బందుల దృష్ట్యా ఆ ప్రాంత యువకులు, మహిళలు తుప్పలు తొలగించడమే కాక జేసీబీ సహాయంతో పాత రహదారిని బాగు చేశారు. గ్రామ యువతను గ్రామస్తులు అభినందించారు.

తాగునీటి బోరు పనులు ప్రారంభం



టెంకాయకొట్టి బోరు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ

నాతవరం: పెదగొలుగొండపేట రైతు భరోసా కేంద్రం వద్ద తాగునీటి బోరు వేసేందుకు సర్పంచ్ మిరపల వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు తమరాన సత్యనారాయణ సోమవారం టెంకాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే జగనన్న లేఅవుట్లలో మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. రైతులు మండల కేంద్రానికి వెళ్లకుండా గ్రామంలోనే కావలసిన అన్ని రకాలు సేవలు ఆర్బీకే ద్వారా లభిస్తున్నాయన్నారు. పి.కె.గూడెం పీఏసీఎస్ డైరెక్టరు గుడపర్తి అచ్చియ్యనాయుడు, పంచాయతీ రాజ్ శాఖ జేఈ వెంకటేశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి శ్రీను పాల్గొన్నారు.

గొలుగొండలో అంబలం పూజ

గొలుగొండ: అయ్యప్పమాలధారణ భక్తులు సోమవారం రాత్రి గొలుగొండలో అంబలం పూజ నిర్వహించారు. ఏఎల్‌పురం, చోద్యం, జోగుంపేట, చీడిగుమ్మల, అమ్మపేట, శ్రీరాంపురం తదితర గ్రామాల నుంచి 300 మందికి పైగా అయ్యప్ప భక్తులు హాజరయ్యారు. అయ్యప్ప శరణఘోషతో గొలుగొండ మారుమోగింది.

ఆరుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా, నాలుగు పర్యాయాలు మంత్రిగా వెలగబెట్టిన చరిత్ర ఆయనది.. అటువంటి రాజకీయ ఉద్ధండుడు సీహెచ్ అయ్యన్నపాత్రుడికి సాధ్యం కాలేదు. బుడ్డడపాడు గిరిజన గ్రామానికి రోడ్డు సౌకర్యం గానీ ఆర్లిలోవ రోడ్డు సమస్యగానీ పరిష్కరించలేక చేతులెత్తేశారు. ఈ నేపథ్యంలో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన ఉమాశంకర్ గణేష్ మాటల్లో కాదు.. చేతల్లో చేసి చూపించారు. అటవీ శాఖ అడ్డంకులు సైతం తొలగించి గిరిజనులకు రాచబాట వేశారు.





ఏడాదిన్నర కిందట బుడ్డడపాడుకు ఏర్పాటు చేసిన తారురోడ్డు

పరిష్కార మార్గం

- బుడ్డడపాడుకు రాచబాట
- వందేళ్ల నాటి ఆర్లిలోవ రోడ్డు సమస్యకు మోక్షం
- నర్సీపట్నం ఎమ్మెల్యే గణేష్ కృషి
- చేతులెత్తేసిన మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు



గతంలో బుడ్డడపాడుకు కొండల మార్గం

గొలుగొండ: పాతమల్లంపేట పంచాయతీ శివారు బుడ్డడపాడు గిరిజన గ్రామానికి ఏళ్ల తరబడి రోడ్డు లేక ఇబ్బందులు పడేవారు. 40 కుటుంబాలు ఇక్కడ కొండల మధ్య జీవనం సాగిస్తున్నాయి. అత్యవసర సమయంలో ఈ గ్రామానికి 104, 108 వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఉంది. 2019 ఎన్నికల హామీ మేరకు నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ 2022 జనవరిలో ఈ రోడ్డు పనులు ప్రారంభించారు. కేవలం నాలుగు నెలల్లోనే పూర్తి చేశారు. రూ.1.30 కోట్లతో మూడు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తుది దశకు ఆరిల్లోవ రోడ్డు పనులు



12 నుంచి 24 అడుగుల రోడ్డు వెడల్పు పనులు చేస్తున్న దృశ్యం

గొలుగొండ: నర్సీపట్నం–కృష్ణదేవిపేట మార్గంలో ఆరిల్లోవ రోడ్డు పనులు తుది దశకు చేరుకున్నాయి. నర్సీపట్నం నియోజకవర్గంలో ప్రధాన సమస్య ఇదే.. వందేళ్లుగా పరిష్కారం కాలేదు. ఈ రోడ్డు విస్తరణకు మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు సైతం చేతులెత్తేశారు. మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచిన పెట్ల ఉమాశంకర్ గణేష్ ఈ ప్రాంత వాహనదారులకు ఇచ్చిన హామీ మేరకు రోడ్డు విస్తరణకు నడుం బిగించారు. అటవీ శాఖ అడ్డంకులు తొలగింపు కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మూడు సార్లు కలిశారు. ఈ నేపథ్యంలో అరిల్లోవ అటవీ పరిధిలో 3.5 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణకు రూ.6 కోట్లు మంజూరు చేశారు. అటవీ శాఖకు ప్రత్యామ్నాయంగా పాకలపాడు రెవెన్యూ పరిధిలో ఐదెకరాల 12 సెంట్లు భూమిని కేటాయించారు. ప్రస్తుతం 80 శాతం పనులు పూర్తయ్యాయి. ఇటీవల వర్షాల వల్ల ఆగిన తారుపూత పనులు వచ్చే నెలలో వేసే అవకాశం ఉంది. ఈ రోడ్డు విస్తరణ వల్ల ఉమ్మడి విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల ప్రజల రాకపోకలకు వీలు కానుంది.

సీఎం, ఎమ్మెల్యేలకు రుణపడి ఉంటాం



మా గ్రామానికి రూ.1.30 కోట్లతో రోడ్డు వేశారు. గత టీడీపీ పాలనలో హామీ ఇచ్చి నెరవేర్చలేదు. ఎన్నికల ముందు మొదటిసారి మా గ్రామానికి వచ్చిన ప్రస్తుత ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ హామీ ఇవ్వడం, ఆ వెంటనే రోడ్డు వేశారు. చంద్రయ్య పాలెం నుంచి బుడ్డడపాడు ఒకే గ్రామానికి రోడ్డు వేయడం చాలా ఆనందంగా ఉంది. ఈ ప్రాంత గిరిజనులు సీఎం జగనన్నకు, ఎమ్మెల్యే గణేష్‌కు రుణపడి ఉంటాం.

– రాజుబాబు, బుడ్డడపాడు, గిరిజన యువకుడు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



బాధితుడు రాజేష్‌కు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: మున్సిపాలిటీ రెండో వార్డుకు చెందిన శృంగవరపు రాజేష్ బ్రెయిన్ ఆపరేషన్ నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.1.50 లక్షలు మంజూరైంది. సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అతడికి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వార్డు కౌన్సిలర్ సిరసపల్లి నారి, ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ ఉన్నీసాబేగం, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, కోఆప్షన్ సభ్యురాలు షేక్ రోజా, యూత్ నాయకులు ధనిమిరెడ్డి ప్రసాద్, కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ అర్జున్ వెంకట్రావు, పార్టీ నాయకులు కిల్లాడ లోవరాజు, ఎల్లేటి శ్రీను, కణితి అన్నపూర్ణ పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ కృషి అభినందనీయం

జూట్ బ్యాగ్స్ ఆవిష్కరణలో ఆర్డీవో జయరాం



జూట్ బ్యాగ్స్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆర్డీవో హెచ్.వి.జయరాం పేర్కొన్నారు. వాకర్స్ క్లబ్ వారు తయారు చేయించిన జూట్ బ్యాగ్స్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు వాకర్స్ క్లబ్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బ తింటుందన్నారు. ప్లాస్టిక్ కవర్లకు బదులుగా ప్రతి ఒక్కరూ క్లాత్ సంచులు వినియోగించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ పూడి రవిబాబు, ఏవో సూర్యనారాయణ, తహసీల్దార్ అన్నాజీరావు, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు స్వామి, వరహాలనాయుడు, ఏరియా ఆస్పత్రి రిటైర్డ్ సూపరింటెండెంట్ హెచ్.వి.దొర, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

లింగ ఆధారిత వివక్షకు వ్యతిరేకంగా ర్యాలీ



ర్యాలీలో ఏపీఎం ప్రభాకర్‌రావు, రమాదేవి

దేవరాపల్లి: లింగ ఆధారిత వివక్షను వ్యతిరేకిద్దామని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం ఎస్.ప్రభాకర్‌రావు అన్నారు. లింగ ఆధారిత వివక్షకు వ్యతిరేకంగా జాతీయ ప్రచారంలో భాగంగా మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గొర్రుపోటు రమాదేవి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో మహిళలు అవగాహన ర్యాలీ నిర్వహించారు. లింగ ఆధారిత వివక్షకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. వెలుగు సీసీ గౌరీష్, తదితరులు పాల్గొన్నారు.

‘వై ఏపీ నీడ్స్ జగన్’ నేడు

దేవరాపల్లి: బోయిలకింతాడలో ‘వై ఏపీ నీడ్స్ జగన్’, జగనన్న నువ్వే మా నమ్మకం, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు హాజరవుతారన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

నర్సీపట్నం ఆర్డీవో జయరాం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఆర్డీవో హెచ్.వి.జయరాం అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ వారం పలు సమస్యలపై మొత్తం 20 అర్జీలు వచ్చాయి. గొలుగొండ మండలం పాతమల్లంపేటలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించిన వారికి కొమ్ముకాస్తున్న వీఆర్వోపై చర్యలు తీసుకోవాలని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు పి.మురళీ ఫిర్యాదు చేశాడు. మున్సిపాలిటీలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, శివపురానికి చెందిన అర్జున్ రావు ఫిర్యాదు చేశాడు. సాగు భూమికి పట్టా ఇప్పించాలని రావికమతం మండలం అర్జాపురానికి చెందిన నాగేశ్వరరావు విన్నవించాడు. వీటిని నిర్ణీత వ్యవధిలో పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు ఆర్డీవో సూచించారు.

కేంద్ర పథకాలపై ప్రజలకు అవగాహన



తామరంలో డ్రోన్‌తో క్రిమిసంహారక మందు పిచికారీపై అవగాహన

మాకవరపాలెం: కేంద్ర పథకాలపై మండలంలోని తామరం, మాకవరపాలెంలో సోమవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న పథకాలు, రాయితీలను ఇన్‌చార్జి ఎంపీడీవో సీతామహాలక్ష్మి వివరించారు. వ్యవసాయశాఖ ద్వారా రైతులు తక్కువ సమయంలో వేగంగా పంటలకు క్రిమిసంహారక మందులను డ్రోన్ ద్వారా పిచికారీ చేయడంపై ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. రాయితీపై అందిస్తామని ఏవో చిరంజీవి తెలిపారు. ఎంఈవో లక్ష్మి, ఏపీవో వరలక్ష్మి, వైద్యాధికారి సీతారామలక్ష్మి, సర్పంచ్ గొంతిన చెల్లారత్నం, తూర్పు కాపు సంఘం మండలాధ్యక్షుడు హరిబాబు, కార్యదర్శులు బాలదొర, మధుసూదనరావు పాల్గొన్నారు.

హరహర మహాదేవ

గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. కార్తీక మాసం రెండో సోమవారం కావడంతో శివాలయాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే నదుల్లో పుణ్యస్నానాలు ఆచరించారు. హరహర మహాదేవ శంభోశంకర అంటూ శైవక్షేత్రాల్లో అభిషేకాలు, అర్చనలు చేశారు. సాయంత్రం పెద్ద ఎత్తున హాజరై కార్తీక దీపాలు వెలిగించారు. దాంతో ఆలయాలు దీపకాంతులతో దేదీప్యమానంగా కనిపించాయి.

- మార్మోగిన శివనామస్మరణ
- కార్తీక మాస భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు
- నదుల్లో పుణ్యస్నానాల ఆచరణ



నర్సీపట్నం: బ్రహ్మలింగేశ్వరస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



రావికమతం: సామూహిక వ్రతాలు చేస్తున్న భక్తులు



దేవరాపల్లి: తిమిరాం ఉమా మహేశ్వర స్వామి ఆలయంలో భక్తుల తాకిడి



చీడికాడ: వరహాపురం అభయాంజనేయ స్వామి దేవాలయంలో భజనలు నిర్వహిస్తున్న దృశ్యం



చోడవరం: ముద్దుర్తి సంగమేశ్వరస్వామి ఆలయం వద్ద నదిలో స్నానాలు చేస్తున్న భక్తులు



నాతవరం: వి.బి.అగ్రహారం శివాలయంలో..



మాకవరపాలెం వామలింగేశ్వర ఆలయంలో..



బుచ్చెయ్యపేట: బంగారుమెట్ట శివాలయం వద్ద దీపారాధన



మాడుగుల రూరల్: కె.జె.పురం శివాలయంలో అభిషేకాలు చేస్తున్న భక్తులు



రోలుగుంట: కార్తీక వన భోజనాలు చేస్తున్న భక్తులు



కె.కోటపాడు:చౌడువాడలో శివలింగాకారంలో దీపాలు

చోడవరం: ప్రాచీన స్వయంభూ గౌరీశ్వరాలయం, విఘ్నేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఇక్కడి కోనేరులో స్నానాలు ఆచరించి పవిత్ర కార్తీక దీపారాధన చేశారు. ముద్దుర్తి త్రివేణి సంగమేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. శారదా, పెద్దేరు, బొడ్డేరు నదీ సంగమంలో స్నానాలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు.

రోలుగుంట: కొవ్వూరులో యర్రంశెట్టి, మలసాల, బంటువారి కుటుంబాలు వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించాయి. కార్యక్రమంలో ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్ కాంతమ్మ, రోలుగుంట పీఏసీఎస్ డైరెక్టరు బాబూరావు పాల్గొన్నారు.

రావికమతం: చినపాచిల కోదండరామ ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. వంద మంది దంపతులతో పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట: బంగారుమెట్ట శివాలయం వద్ద లింగాకారంలో కార్తీక దీపాలు వెలిగించారు. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు పూజలతో పాటు భజనలు, సంకీర్తనలు నిర్వహించారు.

నాతవరం: వి.బి.అగ్రహారంలో పురాతన శివాలయం శివనామస్మరణతో మార్మోగింది. చమ్మచింత శివాలయం వద్ద ఉత్తర దిశగా ప్రవహించే తాండవ నదిలో భక్తులు స్నానమాచరించి స్వామివారిని దర్శించుకున్నారు.

మాకవరపాలెం: స్థానిక పెద్దమిల్లు జంక్షన్‌లోని స్వయంభూ వామలింగేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. పూజలు చేశారు.

కె.కోటపాడు: స్థానిక భీమలింగేశ్వరాలయం, లంకవానిపాలెంలో గృహలింగేశ్వరాలయం, ఎ.కోడూరులో మల్లికార్జున స్వామి ఆలయాల్లో భక్తులు దీపాలంకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. చౌడువాడలో లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద దీపాలంకరణ ఆకట్టుకుంది.

మాడుగుల/మాడుగుల రూరల్: ఎం. కోడూరు కాశీ విశ్వేశ్వరస్వామి, మాడుగులలో ఉబ్బలింగేశ్వర, పార్థసారథి, శ్రీకృష్ణాభూపాలేశ్వర, ఉమా భీమలింగేశ్వర, జంపెన గుప్తలింగేశ్వర, జాలంపల్లి భీమలింగేశ్వర ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

దేవరాపల్లి: స్థానిక వనదేవీశ్వర ఆలయం, వేచలం, పెదనందిపల్లి, చిననందిపల్లి, ఎం. అలమండ, బోయిల కింతాడ తదితర గ్రామాల శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తిమిరాంలో జెడ్పీటీసీ కర్రి సత్యం పూజలు చేశారు.

చీడికాడ: మండలంలో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వరహాపురం అభయాంజనేయ స్వామివారి ఐదో వార్షికోత్సవం వైభవంగా జరిగింది. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

గౌరీ నోములు ప్రారంభం

మాడుగుల: కార్తీక పౌర్ణమి సందర్భంగా గౌరీ నోములు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా డప్పులు, వాయిద్యాలతో మహిళలు పొలాలకు వెళ్లి వరి దుబ్బు పట్టుకుని గౌరీపరమేశ్వర విగ్రహాల వద్ద ఉంచి నోములు ప్రారంభించారు. ఈ కార్యక్రమం మాడుగుల ఎంపీటీసీ పాలిమేర విజయలక్ష్మి సోమవారం నిర్వహించారు.

కె.కోటపాడులో జగనన్నకు చెబుదాం రేపు



తహసీల్దార్ రమేష్‌బాబు

కె.కోటపాడు: మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ఈ నెల 29న నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ జె.రమేష్‌బాబు తెలిపారు. కలెక్టర్ రవి పట్టానొట్టి ఆధ్వర్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. అన్ని గ్రామాల ప్రజలు తమ సమస్యలను లిఖిత పూర్వకంగా తెలియజేయాలన్నారు. దరఖాస్తుతో పాటు సంబంధిత వ్యక్తి ఆధార్ జెరాక్స్ జతచేయాలని సూచించారు.